క్లుప్తంగా

నాగన్నపాలెం ఎస్సీకాలనీలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు



నాగన్నపాలెం ఎస్సీకాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ , సర్పంచ్

మద్దిపాడు: మండలంలోని నాగన్నపాలెం ఎస్సీకాలనీలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వి.జ్యోతి ఆ కాలనీవాసులకు తెలిపారు. బుధవారం సాయంత్రం నాగన్నపాలెం ఎస్సీకాలనీని తహసీల్దార్ సుజన్‌కుమార్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్‌తో మాట్లాడారు. కాలనీలో మొదటి నుంచి సైడు కాలువలు లేవని, వర్షాకాలంలో నీరు నిలిచి అవస్థ పడుతున్నామని స్థానికులు తెలిపారు. కాలనీలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులను కోరారు. ఎంపీడీఓ స్పందించి కాలనీలో నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోయేలా చూస్తామన్నారు. కాలనీని ఆనుకుని ఉన్న పట్టా పొలాన్ని 15 సెంట్ల వరకూ కొనుగోలు చేస్తే కాలనీలోని నీటిని వాగులోకి పంపించే అవకాశం ఉంటుందని కాలనీ వాసులు తెలిపారు. కాలనీవాసులు వినతిపత్రం ఒకటి రాసి తమ కార్యాలయంలో అందిస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపి తదుపరి చర్యలు చేపడతామని తహసీల్దార్ సుజన్‌కుమార్ తెలిపారు. వారి వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

చీమకుర్తి: టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం చీమకుర్తిలో గోల్డెన్ గ్రానైట్ జీఎం గిరిబాబు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గుంటిగంగ వృద్ధాశ్రమంలో, చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ మానసిక వికాస కేంద్రంలో బధిరులకు అన్నదానం చేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాట్రగడ్డ రమణయ్య, కొత్రపు రాఘవ, కందిమళ్ల గంగాధర్, స్థానికులు పాల్గొన్నారు.

రొయ్య రైతుకు మొండిచెయ్యి

- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలకు ఎగనామం
- కొత్తపట్నం మండలంలో ఒక్క రైతుకు కూడా రుణమివ్వని బ్యాంకులు
- మండలంలో అధికారికంగా 650 ఎకరాల్లో రొయ్యల సాగు
- రుణాల గురించి పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు



హేచరీలో రొయ్యల సీడ్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కొత్తపట్నం: రొయ్యల రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి పంట సాగుకు అవసరమైన రుణాలందించి ప్రోత్సహించడంలో విఫలమయ్యారు. రొయ్యల సాగు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం వస్తోంది. మన రాష్ట్రంలో పండించే రొయ్యలను ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. వారు చెల్లించే అనేక రకాల ట్యాక్స్‌ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అంతేగాకుండా రొయ్యల సాగుతో వేలాది మందికి ఉపాధి దొరుకుతోంది. అటువంటి రొయ్యల సాగును, సంబంధిత రైతులను ప్రభుత్వాలు, అధికారులు ప్రోత్సహించకుండా మొండిచెయ్యి చూపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తమకు ఎటువంటి ప్రభుత్వ పథకాలూ అందడం లేదని రొయ్యల సాగు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం చూపిస్తున్నప్పటికీ తమను పట్టించుకోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు. కొత్తపట్నం మండలంలో అధికారికంగా 650 ఎకరాల్లో, అనధికారికంగా 500 ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తున్నారు. ఎక్కువగా ఆలూరు, గాదెపాలెం, బీరంగుంట, మోటుమాల, కొత్తపట్నం, పాదర్తి, ఈతముక్కల, మడనూరు, రాజుపాలెం, గమ్మళ్లపాలెం గ్రామాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. ప్రభుత్వాల ప్రోత్సాహం లేనందున అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ అతికష్టం మీద రొయ్యల సాగు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు.



రొయ్యల చెరువు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఏమైనట్టు..?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పంటల సాగుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెట్టుబడి రుణాలు ఇవ్వాలని ఉత్తర్వులున్నాయి. దాని ప్రకారం రొయ్యల సాగు రైతులకు కూడా రుణాలు ఇవ్వాల్సి ఉంది. కానీ, వరి, వేరుశనగ, శనగ, పత్తి, ఆకుకూరలు, కూరగాయలు వంటి వివిధ రకాల పంటలకు రుణాలు ఇస్తున్నప్పటికీ.. రొయ్యల సాగు రైతులకు మాత్రం ఇవ్వడం లేదు. రొయ్యల రైతుల విషయంలో ఒక్క బ్యాంకు కూడా ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయడం లేదు. సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో రొయ్యల రైతులకు పంట లోన్లు ఇవ్వాలని చెప్పడమే తప్ప ఎవ్వరికీ ఇచ్చిన పాపాన పోలేదు. బ్యాంకర్ల వద్దకు వెళ్తే రొయ్యల చెరువుల మీద పంట లోన్లు ఇవ్వమని తెగేసి చెబుతున్నారు. రొయ్యలు సాగుచేస్తున్నప్పటికీ.. అదే పొలానికి ఇతర పంటలు నమోదు చేసి లోన్లు ఇస్తున్నారని, అదెలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. పలానా సర్వే నంబర్లలో రొయ్యలు సాగుచేస్తున్నారని ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ వారు ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నప్పటికీ.. అదే పొలానికి ఇతర పంటలు నమోదు చేసి రొయ్యల రైతులకు పంట లోన్లు అంటగడుతున్నారు. ఇలా నమోదు చేయడం వలన పంట దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం ఇచ్చే రాయితీ కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. ఒక పంట సాగుచేస్తే వేరే పంట పేరు పెట్టి లోన్లు ఇవ్వడం ఎందుకని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రొయ్యల సాగుకు కూడా పంట రుణాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

యంత్ర పరికరాల కొనుగోలుకు అందని సబ్సిడీలు...

వ్యవసాయానికి అనేక రకాల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. యంత్ర పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు అనేక రకాలుగా సబ్సిడీలు అందిస్తోంది. కానీ, రొయ్యల రైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి ఎటువంటి యంత్ర పరికరాలు ఇవ్వకపోగా, కొనుగోలు చేసుకునేందుకు సబ్సిడీ కూడా ఇవ్వడం లేదని రొయ్యల రైతులు వాపోతున్నారు. విపత్తులు వచ్చినప్పుడు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేకపోవడం వలన సన్న, చిన్నకారు రొయ్యల రైతులు భారీగా నష్టపోతున్నారు. ఫలితంగా ఏడాదికేడాదికీ రొయ్యల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని రొయ్యల రైతులు కోరుతున్నారు.

మాకెవరికీ పంట రుణాలు ఇవ్వడం లేదు



బ్యాంకర్లు రొయ్యల రైతులకు లోన్లు ఇచ్చామని చెప్పుకుంటున్నారుగానీ.. మాకెవ్వరికీ ఇచ్చిన దాఖలాలే లేవు. నేను పదెకరాల్లో రొయ్యలు సాగుచేస్తున్నా. సుమారు పది సంవత్సరాల నుంచి సాగుచేస్తున్నా. ఒక్కో ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. ఎకరాకు కనీసం రూ.2 లక్షల రుణమైనా ఇవ్వమని అడుగుతున్నాం. కానీ, బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. బ్యాంకర్లు సహకరిస్తేనే రొయ్యల రైతులు బాగుపడతారు.

– పురిణి వెంకట్రావు, రొయ్య రైతు, మోటుమాల

అప్పులు తెచ్చుకుని నష్టపోతున్నాం



నేను నాలుగు ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగుచేస్తున్నా. భూమికి ఆన్‌లైన్ ఉన్నా, సాగు ఉన్నా బ్యాంకర్లు పంట లోన్లు ఇవ్వడం లేదు. దీంతో ప్రైవేటు వ్యక్తుల దగ్గరకు వెళ్లి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని రొయ్యలు సాగుచేస్తున్నా. మాకు వచ్చే ఆదాయం కాస్తా వడ్డీలకే సరిపోతోంది. బ్యాంక్‌లు సహకరిస్తేనే మేము ఆర్థికంగా నిలదొక్కుకుంటాం.

– పి.శ్రీనివాసరెడ్డి, రొయ్య రైతు, మోటుమాల

అన్ని అర్హతలు ఉంటే తప్పనిసరిగా రుణాలిస్తాం

ఇటీవల మోటుమాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రొయ్యల రైతులు తమకు రుణాలు ఇవ్వడం లేదని కలెక్టర్‌కు తెలిపారు. ఆ తర్వాత బ్యాంకర్ల దగ్గరకు వెళ్లి రొయ్యల సాగుకు రుణాల గురించి మాట్లాడాను. అన్ని అర్హతలు ఉంటే తప్పనిసరిగా రొయ్యల రైతులకు కూడా లోన్లు ఇవ్వాలని మేనేజర్లను ఆదేశించాను. అంతేకాకుండా గ్రామాల వారీగా రొయ్యల సాగు వివరాలు అందించాలని ఫిషరీస్ అసిస్టెంట్‌కు సూచించాను. కొత్తపట్నం మండలంలో రొయ్యల సాగు రైతులకు తప్పనిసరిగా రుణాలిప్పిస్తాను.

– డి.రమేష్, ఎల్‌డీఎం

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి గణపతి



దీపాలంకరణలో హరిహరసుత అయ్యప్పస్వామి

ఒంగోలు మెట్రో: నగరంలోని అయ్యప్పస్వామి ఆలయాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం శివాలయం వద్ద ఉన్న అయ్యప్పస్వామి మందిరంలో, గొడుగుపాలెంలోని అయ్యప్పస్వామి క్షేత్రంలో, మంగమూరు రోడ్డులోని హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశ కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పరాంకుశ చక్రవర్తి, రంగస్వామి, సమీర్ ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించి అర్చన, మంగళ హారతులతో భక్తులకు స్వామివారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో అయ్యప్ప, భవాని, శివమాలలు ధరించిన స్వాములు పాల్గొన్నారు.

కార్యసిద్ధి గణపతికి అభిషేకాలు...

నగరంలోని రాజాపానగల్ రోడ్డులోని లక్ష్మీగణపతికి, అద్దంకి బస్టాండ్ దగ్గర విఘ్నేశ్వరస్వామికి, ఒంగోలు బైపాస్ ఫ్లై ఓవర్ దగ్గర మహాగణపతికి, నెల్లూరు బస్టాండ్ దగ్గర కార్యసిద్ధి గణపతికి, కర్నూల్ రోడ్డులోని శ్రీనగర్‌కాలనీ మొదటి లైన్‌లోని విజయ గణపతికి, మణికంఠనగర్లోని మహాగణపతికి, కర్నూల్ రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లో వరసిద్ధి వినాయకస్వామికి ఆలయ అర్చకులు బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

పలు గ్రామాల్లో పంచాయతీ వారోత్సవాలు

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం, సంతనూతలపాడు, మంగమూరు గ్రామాల్లో పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన కోటీ 45 లక్షల రూపాయలతో సైడు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్ శంకుస్థాపన చేశారు. నియోజకవర్గానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 21 కోట్ల రూపాయలు మంజూరవగా, వాటిలో సంతనూతలపాడు మండలానికి ఐదు కోట్ల రూపాయలు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చీమకుర్తి మండలానికి నిధులు నిల్..

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండలంలోని 24 పంచాయతీలకూ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు కాకపోవడంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకుల తీరును విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని, పంచాయతీల్లో సమస్యలు తిష్ట వేశాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చీమకుర్తి మండలానికి కూడా ఉపాధి నిధులు కేటాయించి పల్లె పండుగ కార్యక్రమాలలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోండి

- గొడవల్లో పాల్గొంటే పీడీ యాక్టే
- హెచ్చరించిన డీఎస్పీ శ్రీనివాసరావు



తాలూకా పోలీసుస్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

ఒంగోలు టౌన్: రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలని, ఏదైనా గొడవల్లో తలదూరిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. నగరంలోని వన్‌టౌన్, టూటౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం తాలూకా పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు, దందాల్లో పాల్గొంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఏదైనా ఘర్షణలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రౌడీ షీటర్ల ప్రస్తుత జీవనాధారం గురించి వాకబు చేశారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్‌కుమార్ ఉన్నారు.



చదలవాడ చెరువుకు గండిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా





ఒంగోలు మదర్‌థెరిస్సాకాలనీలో నివాసాల మధ్య నిలిచిన వర్షం నీరు



మదర్‌థెరిస్సాకాలనీలో ఇంట్లోకి చేరిన వరద నీరు

కుంభవృష్టి..!

- ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలను ముంచేసిన వాన
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం
- ఒంగోలు నగరంలోని ప్రధాన రహదారుల్లో సైతం వర్షం నీరు నిలిచి అవస్థలు



మదర్‌థెరిస్సాకాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్, కమిషనర్

ఒంగోలు వన్‌టౌన్: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలు జలమయమయ్యాయి. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు, రహదారుల్లో భారీగా నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని శివారు కాలనీలతో పాటు ప్రధాన రోడ్లపై సైతం వర్షం నీరు ప్రవహిస్తూ చెరువులు, నదులను తలపిస్తున్నాయి. భాగ్యనగర్, అన్నవరప్పాడు, గాంధీ రోడ్డు, మంగమూరు రోడ్డు, బస్టాండ్ సెంటర్, పాత మార్కెట్ సెంటర్ లాంటి అనేక ప్రధాన కాలనీలు, సెంటర్లు కూడా వరద ప్రభావానికి గురయ్యాయి. మురుగునీటి కాలువలన్నీ పొంగిపొర్లి రోడ్లన్నీ వర్షం నీటి ప్రవాహంతో నిండిపోయి వాహనదారులు, స్థానిక ప్రజలు అవస్థపడ్డారు. పలు రోడ్లపై గుంతలు ఉండి వాటిలో నీరు చేరడంతో కొందరు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు నరకం చూశారు. నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలమవడం కారణంగా ప్రజలు మరింత అసౌకర్యానికి గురయ్యారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్యం అటకెక్కి పలుచోట్ల పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగుకు వర్షం నీరు తోడవడంతో మురికికూపాలు ఏర్పడి దుర్గంధం వెదజల్లుతోంది.

పూడికతీత పనులు చేపట్టాలి : కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో వెంటనే పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బుధవారం ఒంగోలు నగర మేయర్ సుజాతతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. మదర్‌థెరిస్సాకాలనీ, నల్లవాగును పరిశీలించి అక్కడి పరిస్థితుల గురించి కాలనీవాసులతో మాట్లాడారు. విద్యుత్, తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఒంగోలు నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కేశవరాజుకుంట, బలరాం కాలనీ, నేతాజీకాలనీ, నెహ్రూనగర్, మదర్‌థెరిస్సాకాలనీ, తదితర కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆమె వెంట నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు...

సంతనూతలపాడు: భారీ వర్షాలకు మండలంలోని మంగమూరు నల్లవాగు, మద్దులూరు పంచాయతీ మాచవరం సమీపంలోని బ్రిడ్జి వద్ద ఇనగలేరు పొంగిపొర్లుతున్నాయి. రహదారిపై నీరు ప్రవహిస్తుండటంతో బుధవారం తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు. మంగమూరు–ఒంగోలు మధ్య నల్లవాగు నీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మాచవరం, అనకర్లపూడి గ్రామాల సమీపంలో వాగులు పొంగడంతో ఒంగోలు – కొండపి వెళ్లే వాహనాలు మద్దులూరు వద్ద నిలిచిపోయాయి. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించి ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా చూడాలని తహసీల్దార్ ఆదేశించారు. సంతనూతలపాడు, ఒంగోలు తాలూకా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆ రెండు వాగుల వద్ద బందోబస్తు చేపట్టారు. తహసీల్దార్ వెంట వీఆర్వోలు, వీఆర్‌ఏలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు



కేశవరాజుకుంటలో నివాసాల మధ్య నిలిచిన వర్షం నీరు



ఒంగోలు అన్నవరప్పాడులో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



కొప్పోలు-కరవది రోడ్డులోని ముదిగొండవాగును పరిశీలిస్తున్న కలెక్టర్



నగరంలో కురుస్తున్న వర్షం



చదలవాడ చెరువుకు గండి పడిన ప్రదేశం



ఒంగోలు అద్దంకి బస్టాండ్ సెంటర్లో బుధవారం రాత్రి కురుస్తున్న వర్షం



మంగమూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి



ఒంగోలు-కర్నూలు రోడ్డుపై పాలకేంద్రం సమీపంలో ప్రవహిస్తున్న వర్షం నీరు



లాయర్‌పేట ప్రకాశం పంతులు విగ్రహం సెంటర్లో రోడ్డుపై భారీగా నిలిచిన నీరు